

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (ఆదివారం సాయంత్రం)
సహర్: 4:55 (సోమవారం ఉదయం)



వీసీ నందకుమార్‌రెడ్డి

కాళోజీ వర్సిటీని ప్రక్షాళన చేయరూ..

ఆరోగ్య విశ్వవిద్యాలయానికి సమస్యల జబ్బు

- పీజీ సీట్ల కేటాయింపులో అక్రమాలు
- దంత వైద్యుడికి కీలక బాధ్యతలు
- ప్రశ్నాపత్రాల తారుమారుతో అప్రతిష్ట
- రిటైర్డు ఉద్యోగులకు పునరావాస కేంద్రంగా వర్సిటీ!
- పీఆర్‌వో, గ్రీవెన్స్ ఏమైనట్లో?
- కొత్త వీసీ నందకుమార్‌రెడ్డి పరిస్థితులను గాడిలో పెట్టేనా?
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఎదురుచూపు

వరంగల్ మెడికల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. నూతన ఉప కులపతికి ఇవి స్వాగతం పలుకుతున్నాయి. పదేళ్లుగా విశ్వవిద్యాలయం అనేక సమస్యలతో సతమతమవుతోంది. చివరికి పరీక్షల నిర్వహణలో కూడా అభాసుపాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి. విశ్వవిద్యాలయంలో ఒక వర్గం కోటరీగా ఏర్పడి పెత్తనం చెలాయిస్తున్నట్లు బహిరంగంగానే విమర్శలు ఎదుర్కొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వైద్య విద్యార్థులు, తల్లిదండ్రులు కొన్నేళ్లుగా అనేక కష్టాలు ఎదుర్కొన్నారు.

పర్యవేక్షణ లోపమే కారణం

గత ప్రభుత్వం 2016 నుంచి ఆరోగ్య విశ్వవిద్యాలయం పర్యవేక్షణ చేయకపోవడంతో పాలన గాడి తప్పిందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. విశ్వవిద్యాలయంలో 150 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, కేవలం 20 మంది రెగ్యులర్ ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 15 మంది జూనియర్ అసిస్టెంట్లు, నలుగురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ఒక రిజిస్ట్రార్ ఉన్నారు.

పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తం

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎంబీబీఎస్, పీజీ పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పాత ప్రశ్నపత్రాలు తిరిగి ఇచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. నిర్ణీత షెడ్యూల్‌లో పరీక్షలు నిర్వహించడం, ఫలితాలు ఇవ్వడంలో యూనివర్సిటీ వైఫల్యం ఎదుర్కొంది. సర్టిఫికెట్ల జారీలో కూడా జాప్యం జరుగుతోంది. ఇక సర్టిఫికెట్లలో తప్పులు జరిగితే సరిద్దేందుకు చుక్కలు కనబడాల్సిందేనని విద్యార్థులు వాపోతున్నారు.

పీజీ సీట్ల కేటాయింపులో అక్రమాలు

పీజీ సీట్ల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు కొన్నేళ్లుగా వస్తున్నాయి. ఇందుకు 2022లో జరిగిన గోల్‌మాల్ ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ) విచారణ చేపట్టగా విశ్వవిద్యాలయంలో కొందరు అధికారులు సహకరించడం లేదని ప్రచారం జోరుగా సాగుతోంది.

హెల్ప్‌లైన్ సెంటర్ అవసరం

వివిధ అవసరాల నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు, తల్లిదండ్రులకు గ్రీవెన్స్‌సెల్ లాంటి హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం కాళోజీ విశ్వవిద్యాలయంలోనికి కూడా అనుమతించరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ఆరోగ్య విశ్వవిద్యాలయానికి పీఆర్‌ఓ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.

పునరావాస కేంద్రంగా యూనివర్సిటీ

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉద్యోగ విరమణ పొందిన వారికి, ఫారిన్ సర్వీసెస్‌పై వచ్చే ఉద్యోగులకు పునరావాస కేంద్రంగా మారింది. ఫలితంగా వారిలో జవాబుదారీతనం లోపించడంతో వైద్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

డిప్యూటేషన్ తీసుకొచ్చి.. ఎగ్జామినేషన్ కంట్రోలర్‌గా నియమించి

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో దంత వైద్య విభాగంలో హెచ్‌ఓడీగా పని చేస్తున్న డాక్టర్ మల్లేశ్వర్‌ను కాళోజీ విశ్వవిద్యాలయానికి డిప్యూటేషన్‌పై తీసుకొచ్చి ఎగ్జామినేషన్ కంట్రోల్‌గా నియమించారు. ఇది నిబం ధనలకు వ్యతిరేకమైనా అప్పటి కోటరీలో భాగంగా అందరినీ పక్కన పెట్టి నియామకం చేసినట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. ఎంబీబీఎస్, పీజీ చేసిన వైద్యులను మాత్రమే నియమించాల్సి న ఈ కీలకపోస్టులో దంత వైద్యుల నియా మకం వెనుక ఆంతర్యం ఏమిటో ఎవరికీ అంతు చిక్కడం లేదు. పైగా ఈ అధికారే ఫైనాన్స్ అధికారిగా కూడా వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ప్రక్షాళన చేయాలి..

సమస్యలతో సతమతమవుతున్న కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని నూతన వీసీ డాక్టర్ నంద కుమార్‌రెడ్డి ప్రక్షాళన చేయాలని వైద్య విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. జవాబుదారీతనం సిబ్బందిలో లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం విశ్వవిద్యాలయంలోనికి అనుమతించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పారదర్శకమైన పాలన కోసం వివిధ సమస్యలపై విశ్వవిద్యాలయానికి వచ్చే వారిని లోనికి అనుమతించాలని వైద్య విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోగ్య విశ్వవిద్యాలయంలో ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుగుణంగా పాలక కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



దగ్ధమైన ఇల్లు



గాయపడిన బోడా రమేష్

భార్య బంధువుల వేధింపులు భరించలేక..

భర్త ఆత్మహత్యాయత్నం

- ఇల్లు దగ్ధం, రూ.లక్షన్నర ఆస్తినష్టం
- మాకులతండాలో ఘటన

మరిపెడ, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : భార్య తరుపు బంధువుల వేధింపులు భరించలేక, ఇంటికి నిప్పుపెట్టుకొని భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపాలిటీ పరిధి లోని మాకులతండాలో చోటు చేసు కుంది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బోడా రమేష్‌కు అదే తండాకు చెందిన నవ్యతో ఏళ్లక్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అబ్బాయిలు సంతానం. కాగా, నవ్య తమ్ముడు ఉజ్వల్‌కు రమేశ్ చెల్లితో వివాహ మైంది. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభం కావడంతో ఆరు నెలలల క్రితం నవ్య పుట్టింటికి వెళ్లి, అక్కడే ఉంటుంది. ఈ క్రమంలో భార్య కాపురం కోసం పెద్ద మనుషుల పంచాయతీ పెట్టించినా ఫలితం లేదు. దీనికి తోడు భార్య తరుపు బంధువుల వేధింపులతో పాటు.. ఇటీవల ఆ తండాలో జరిగిన ఓ చోరీలో రమేష్ ప్రమేయం ఉందని ప్రచారం చేయడంతో తీవ్రమనస్థాపానికి గురైన ఆయన శనివారం ఉదయం ఇంట్లోకి వెళ్లి గడియపెట్టుకొని ఇంటికి నిప్పు అంటించుకొన్నారు. మంటలతో పొగలు చూరడంతో ఇరుగుపొరుగు వారు గుర్తించి ఆ ఇంటి తలుపులు తీసి రమేష్‌ను మంటల నుంచి కాపాడారు. తండా వాసులు నీళ్లతో మంటలను ఆర్పి వేయడంతో పెను ప్రమాదం నుంచి బయటపడ్డామని ఊపిరిపీల్చుకు న్నారు. ఈ ఘటనలో ఇల్లుతో పాటు బీరువా, ఫ్రిడ్జి, మంచం, బియ్యం, అరతులం బంగారం, బట్టలు, ఇత ర్రాత వంట సామగ్రి మంటలకు కాలిపో యాయి. ఈ ఘటనలో రూ.లక్షన్నర అస్తి నష్టం వాటిల్లింది. పోలీసులు ఈ విషయంపై దర్యాప్తు జరుపుతున్నారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ, కాలం చెల్లిన పురుగుమందుల డబ్బాలు, నిందితులను చూపుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

నకిలీ పురుగులమందుల విక్రయ ముఠా అరెస్టు

- ఐదుగురి అరెస్టు, ఒకరు పరార్, మరొకరు జైలులో..
- రూ.78.63లక్షల మందులు స్వాధీనం
- నిందితులపై పీడీ యాక్టు నమోదుకు చర్యలు
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

6

పోక్సో బాధితుల ఖాతాల్లో రూ.20.75లక్షలు జమ

ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



మహబూబాబాద్ భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సుధీర్ రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : పోక్సో బాధితుల ఖాతాల్లో రూ.20.75 లక్షలు జమ అయినట్లు ఎస్పీ సుదీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను శనివారం ఆకస్మికంగా సందర్శించి, అందుతున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 నుంచి 2024 వరకు భరోసా కేంద్రం ద్వారా 56 మంది బాధితులకు ప్రభుత్వం తరుపున రూ.20.75 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆయా డబ్బులను బాధితుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఎఫ్‌ఐఆర్ దశలో 50 మంది బాధితులకు రూ.12.50 లక్షలు, చార్జీషీట్ దశలో 23 మంది బాధితులకు రూ.5.75 లక్షలు, జడ్జిమెంట్ దశలో 5 మందికి రూ.2.50 లక్షలు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఈ విషయంలో కృషి చేసిన మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్యను ప్రత్యేకంగా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో షీటీమ్ ఎస్సై సునంద, రూరల్ ఎస్సై దీపిక, ఎస్బీఐ సీఐ చంద్రమౌళి, భరోసా టీం సభ్యులు జ్యోత్స్న, జయశ్రీ, పార్వతి, రేణుక, మౌనిక పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి

జిల్లా ఉద్యానశాఖ అధికారి మానస

దంతాలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి బి.మానస అన్నారు. శనివారం ఆమె గున్నేపల్లి, కుమ్మరికుంట్ల గ్రామాల్లో సాగులో ఉన్న ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ చెట్టు పాదు చుట్టూ జనుము, జీలుగా రెండువరసలు వేయాలన్నారు. కొన్ని సందర్భాల్లో వచ్చే కొమ్ముపురుగు నివారణకు లాంబ్డాసైహాత్రిన్, సాఫ్ పౌడర్‌ను అధికారుల సూచన మేరకు పిచికారి చేయాలన్నారు. ఆయిల్‌పామ్ తోటలో లేతసాగులో ఉన్న మొక్కలకు మూడు 19 లేదా మూడు 17 ఫర్టిలైజర్స్‌ను వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దీక్షిత్‌కుమార్, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ అసిస్టెంట్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దు

ఏడీఏ విజయనిర్మల హెచ్చరిక

గంగారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రానున్న వ్యవసాయ సీజన్‌లో వ్యాపారులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే, చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల హెచ్చరించారు. శనివారం మండలంలో పలు ఎరువుల దుకాణాలలో ఉన్న రికార్డులను, ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులతో పాటు విత్తనాలను ఈ ఏడాది వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో లైసెన్సు లేకుండా ఎరువులు పురుగు మందులు విక్రయించే వారి వివరాలు సేకరించి, వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనాల కోసం ఎదురుచూపు

- సమగ్ర కులగణన చేసి నెలలు గడుస్తున్నా అందని డబ్బులు
- సర్వేలో పాల్గొన్న 1,993 మంది ఎన్యుమరేటర్స్, 196 మంది సూపర్‌వైజర్లు
- జిల్లాలో రూ.22.23 కోట్లు పెండింగ్



నర్సింహులపేటలో సర్వే వివరాలను సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

నర్సింహులపేట, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే పూర్తిచేసి నెలలు గడుస్తున్నా.. గౌరవ వేతనాల కోసం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, నోడల్ ఆఫీసర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు నిర్వహించారు. ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయులు, సర్వశిక్షా అభియాన్ ఉగ్యోగులు, సూపర్‌వైజర్లుగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, నోడల్ ఆఫీసర్లుగా తహసీల్దార్, ఎంపీడీవోలు సర్వేలో పాల్గొన్నారు. సర్వేలో పాల్గొన్న ఒక్కో ఎన్యుమరేటర్‌కు రూ.10వేలు, సూపర్‌వైజర్‌కు రూ.12 వేలు, నోడల్ అధికారికి రూ.15 వేల, చొప్పున ప్రభుత్వం జిల్లాకు రూ.22.23 కోట్లు గత డిసెంబర్ మాసంలో విడుదల చేసినప్పటికీ, నేటికీ బాధితులకు అందకపోవడంపై ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

40 రోజుల సర్వే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 2024 నవంబరు 4 నుంచి 2024 డిసెంబరు 16 వరకు ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 నుంచి 175 కుటుంబాలను కేటాయించి, కుటుంబ సమగ్ర కులగణన సర్వేను నిర్వహించారు. సర్వే కాలంలో 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ చొప్పున, వీరిపైన నోడల్ ఆఫీసర్‌లను ఏర్పాటు చేశారు. ఎన్యుమరేటర్లు ఇచ్చిన నివేదికను సూపర్‌వైజర్లు కంప్యూటర్ ఆపరేటర్లు కలిసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సర్వేను పూర్తి చేశారు.

ఐదు నెలలు గడుస్తున్నా..

సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్ రూ.10 వేలు, సూపర్‌వైజర్‌కు రూ.12వేలు, నోడల్ ఆఫీసర్‌కు రూ.15వేలు చొప్పున రాష్ట్ర ప్రభు త్వం విడుదల చేసి నెలలు గడుస్తున్నా బాధితులకు నేటికి గౌరవ వేతనాలు అం దకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

గౌరవ వేతనాలు అందించాలి



– విష్ణువర్ధన్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, నోడల్ అధికారులకు ప్రభుత్వం నుంచి విడుదల అయిన గౌరవ వేతనాలు తక్షణమే అందజేయాలి. జాప్యం చేస్తే ఆందోళన చేసేందుకు వెనుకాడబోమన్నారు.

మండలాల వారీగా..

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో 1,993 మంది ఎన్యుమరేటర్లు, 196 మంది సూపర్‌వైజర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు. బయ్యారంలో 110 మంది ఎన్యుమరేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లు, చిన్నగూడూరులో 41 మంది ఎన్యుమరేటర్లు, 5 సూపర్‌వైజర్లు, దంతాలపల్లిలో 76 మంది ఎన్యుమరేటర్లు, 7 సూపర్‌వైజర్లు, డోర్నకల్ సీరోల్‌లో 93 మంది ఎన్యు మరేటర్లు, 9 మంది సూపర్‌వైజర్లు, గన్నారంలో 30 మంది ఎన్యుమరేటర్లు, 4 సూపర్‌వైజర్లు విధుల్లో పాల్గొన్నారు. గార్లలో 120 మంది ఎన్యుమరేటర్లు, 9 మంది సూపర్‌వైజర్లు, గూడూరులో 131 మంది ఎన్యుమరేటర్లు, 13 మంది సూపర్‌వైజర్లు, కేసముద్రం, ఇనుగుర్తిలో 191 మంది ఎన్యుమరేటర్లు 18 మంది సూపర్‌వైజర్లు, కొత్తగూడలో 76 మంది ఎన్యుమరేటర్లు, 8 మంది సూపర్‌వైజర్లు, కురవి సీరోల్‌లో 168 మంది సూపర్‌వైజర్లు, 18 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొన్నారు.

మహబూబాబాద్‌లో 108 మంది ఎన్యుమరేటర్లు, 11 మంది సూపర్‌వైజర్లు, మరిపెడలో 142 మంది ఎన్యుమరేటర్లు, 12 మంది సూపర్‌వైజర్లు, నర్సింహుల పేటలో 69 మంది ఎన్యుమరేటర్లు, 7 సూపర్‌వైజర్లు, నెల్లికుదురులో 137 మంది ఎన్యుమరేటర్లు, 12 మంది సూపర్‌వైజర్లు, పెద్ద వంగరలో 83 మంది ఎన్యుమ రేటర్లు, 8 మంది సూపర్‌వైజర్లు, తొర్రూరులో 132 మంది ఎన్యుమరేటర్లు, 13 మంది సూపర్‌వైజర్లు, డోర్నకల్ మున్సిపల్‌లో 34 మంది ఎన్యుమరేటర్లు, 4 మంది సూపర్‌వైజర్లు మహబూబాబాద్ మున్సిపల్‌లో 155 మంది ఎన్యుమరేటర్లు, 19 మంది సూపర్‌వైజర్లు, మరిపెడ మునిసిపల్‌లో 43 మంది ఎన్యుమరేటర్లు, 4 సూపర్‌వైజర్లు, తొర్రూరు మునిసిపల్‌లో 54 మంది ఎన్యుమరేటర్లు, 5 సూపర్‌వైజర్లుతో పాటు సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేట్లు విధులు నిర్వహించారు.

సుఖవ్యాధుల నివారణ వైద్యసేవలు ఒకేచోట

మహబూబాబాద్ డీఎంహెచ్‌వో మురళీధర్



సమావేశంలో మాట్లాడుతున్న గుండాల మురళీధర్

నెహ్రూసెంటర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ సుఖవ్యాధులకు సంబంధించిన అన్ని పరీక్షలు ఒకేచోట ఉచితంగా అందిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి గుండాల మురళీధర్ తెలిపారు మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని ఐఎంఎ హాల్‌లో సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖలోని సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, బాలరక్ష భవన్ చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ, ఉమెన్ హబ్, సఖి సెంటర్‌కు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల మురళీధర్ మాట్లాడుతూ సుఖవ్యాధుల బారిన పడిన రోగులు నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్‌ఐవీకి సంబంధించిన అన్ని సేవలు ఒకేచోట ఉచితంగా లభిస్తాయని, అంతేకాకుండా కన్సల్టెన్స్ చికిత్స, ఇతర సంబంధిత సేవలు ఉచితంగా అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, పరికిపండ్ల అశోక్, సారయ్య పాల్గొన్నారు.

పోరాట ఫలితమే వర్గీకరణ బిల్లుకు ఆమోదం

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు సతీష్, ఇరుగు పైడి



పస్రాలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి నినదిస్తున్న ఉద్యమ సంఘాల నాయకులు

గోవిందరావుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభించిందని ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడి అన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆమోదం పొందడాన్ని స్వాగతిస్తూ మండలంలోని పస్రాలో శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ లేకుంటే ఎస్సీ వర్గీకరణ పోరాటం లేదని, ఎస్సీ వర్గీకరణ కోసం ఆయన సుదీర్ఘకాలం పాటు మడమ తిప్పకుండా రాజీలేని పోరాటం చేయడం వల్ల అసెంబ్లీలో బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని అన్నారు. న్యాయమైన లక్ష్యం కోసం పోరాటం బలంగా చేస్తే ఏనాటికైనా విజయం వరిస్తుందని ఎమ్మార్పీఎస్ ఉద్యమం రుజువు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పేరాల బలరాం, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు తోకల రాంబాబు, నాయకులు పసుల భద్రయ్య, పంగ శ్రీనివాస్, ఎనగందుల మొగిలి, తిక్క దుర్గారావు, యాకోబు, మస్క రమేష్, కొయ్యడ ఓదెలు, వేల్పుల సాంబయ్య, మునిగాల సాంబయ్య, గడ్డం ప్రవీణ్, అనిల్, ఇ.శేఖర్ పాల్గొన్నారు.

కరెంటు ఉచ్చులు.. పోతున్న ప్రాణాలు

- పంట రక్షణ చర్యలకు బలవుతున్న ప్రజలు
- ఏజెన్సీ మండలాల్లో యథేచ్ఛగా వన్యప్రాణుల వేట
- అడవిపందులు, కోతుల నుంచి పంట రక్షణకు ఏర్పాటు
- వరుస ప్రమాదాలు జరుగుతున్నా మారని తీరు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- కేసులు పెడతామని హెచ్చరిక

ములుగు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల వేట, అటవీ జంతువుల నుంచి పంట రక్షణ కోసం అమర్చుతున్న కరెంటు ఉచ్చులు ప్రమాదకరంగా మారుతున్నాయి. విద్యుదాఘాతానికి గురై మరణాలు సంభవిస్తుండగా.. పలువురు తీవ్రంగా గాయపడి శాశ్వత వైకల్యానికి గురవుతున్నారు. ఉచ్చులు పెడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్న పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ జనంలో మార్పు మాత్రం రావడం లేదు. శుక్రవారం రాత్రి ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు వెళ్లి కరెంటు ఉచ్చు పెడుతున్న క్రమంలో ప్రమాదానికి గురై గంగయ్య అనే వ్యక్తి మరణించిన ఘటనతో పోలీసు, అటవీ శాఖలు అప్రమత్తమయ్యాయి.

అడవిలో ఆగని 'షికారు'

వన్యప్రాణుల వేటను గ్రామాలలో షికారుగా పిలుస్తారు. ఏజెన్సీ మండలాలైన ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, వాజేడు, కన్నాయిగూడెం, గోవిందరావుపేట, వెంకటాపురంలో ఇది నిత్యకృత్యం. అడవిపందులు, జింకలు, దుప్పులు, కనుజు, కుందేలు, కొండ గొర్రెల కోసం ఉచ్చులు ఏర్పాటు చేస్తున్నారు. అడవికి సమీపంలోని విద్యుత్ స్తంభాలకు తీగలు తగిలించి జంతువులు సంచరించే ప్రదేశాలలో ఉచ్చులు అమర్చుతున్నారు. రాత్రివేళ తీగలను గమనించని వన్యప్రాణులు అందులోపడి మరణిస్తున్నాయి. తెల్లవారుజామునే జంతువుల కళేబరాలను రహస్యంగా గ్రామాలకు తీసుకువచ్చి మాంసాన్ని విక్రయిస్తున్నారు. కిలో మాంసం తక్కువలో తక్కువగా రూ.350లు పలుకుతోంది. ఒక్క రాత్రికే రూ.6 వేలకు పైనే సంపాదిస్తుండటంతో చాలా మంది జంతువుల వేటను వృత్తిగా మలుచుకున్నారు.

పంట చేలకు రక్షణగా..

ఇటీవలికాలంలో కోతులు, అడవిపందుల సంతతి ఎక్కువైంది. ఆహారం కోసం అవి పంటపొలాలపై పడుతున్నాయి. మొక్కజొన్న, వరి, పత్తి, పుచ్చ, అరటి తోటలలో చొరబడి ధ్వంసం చేస్తున్నాయి. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి చేతికి వచ్చే దశలో నష్టం జరుగుతుండటంతో రైతులు వేదన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు చేను చుట్టూ కరెంటు తీగలు అమర్చుతున్నారు. ఇది ప్రమాదకరం, చట్టరీత్యా నేరమైనప్పటికీ చేనును కాపాడుకునేందుకు తప్పడంలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



కరెంటు ఉచ్చులపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శబరీశ్ (ఫైల్)

ఉచ్చులకు బలవుతున్న మనుషులు..

జంతువుల వేట, పంటల రక్షణ కోసం ఏర్పాటుచేసే ఉచ్చులు మనుషుల ప్రాణాలను తీస్తున్నాయి. ములుగు మండలం అబ్బాపూర్ శివారులో తమ మెక్కజొన్న చేను చుట్టూ ఏర్పాటుచేసిన కరెంటు తీగలు తగిలి జాకారానికి చెందిన ఓ మహిళ మృతి చెందింది. మంగపేట మండలం పాలాయిగూడెం అటవీ ప్రాంతంలో ఓగిరిజనుడు ఉచ్చులో పడి తీవ్రంగా గాయపడ్డాడు. ములుగు మండలం జగ్గన్నగూడానికి చెందిన ఓ ఆదివాసీ వృద్ధుడు మరణించాడు. గతేడాది మార్చిలో వాజేడు మండలం చెరుకూరుకు చెందిన అభినయ్ అనే యువకుడు మరణించాడు. మేత కోసం అడవిలోకి వెళ్లిన గేదెలు, ఆవులు పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డాయి.

కఠినంగా చట్టాలు

కరెంటుతో ఉచ్చులు అమర్చడం చట్టరీత్యా నేరం. కనీసం మూడు సంవత్సరాలు శిక్ష పడే అవకాశాలున్నాయి. బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద పదేళ్లు, ఎలక్ట్రిసిటీ యాక్ట్ సెక్షన్ 135 ప్రకారం మూడేళ్లు, వైల్డ్‌లైఫ్ ప్రొటెక్ట్ యాక్ట్ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష పడుతుంది. చట్టాలపై అవగాహన లేక సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో కొందరు, పంటచేల చుట్టూ తీగలు పెట్టి రైతులు కేసుల పాలవుతున్నారు. ఇటీవల ములుగు మండలానికి చెందిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. అబ్బాపురం, కుమ్మరిపల్లి గ్రామాల శివారులో మొక్కజొన్న, వరిచేల చుట్టూ పెట్టిన తీగలను తొలగించారు. విద్యుత్ తీగలతో ఉచ్చులు ఏర్పాటు చేయడం ద్వారా కలిగే ప్రమాదాలు, నష్టాలపై అవగాహన కల్పిస్తూ జిల్లావ్యాప్తంగా పోస్టర్‌లు అంటించిన పోలీసులు ఆటోల ద్వారా ఊరూరా ప్రచారం కూడా చేశారు. పలువురిని బైండోవర్ చేశారు. ప్రత్యేక గ్రామసభలు కూడా నిర్వహించారు. ఉచ్చులు అమర్చిన సమాచారం ఇస్తే ప్రోత్సాహకంగా రూ.5వేల నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. అయినప్పటికీ చాలా మందిలో మార్పు రావడంలేదు.

ప్రాణాలు తీసిన జంతువుల వేట!

- విద్యుత్ తీగలు అమర్చుతుండగా ప్రమాదం
- ఒకరి మృతి.. గాయాలతో రాత్రంతా నరక యాతన
- అతడితో వెళ్లిన మరో ఇద్దరి పరారీ



గంగయ్య (ఫైల్)

ఏటూరునాగారం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు పెట్టి మూగ జీవాలను చంపేందుకు యత్నించిన వ్యక్తిని అదే విద్యుత్ కబళించిన సంఘటన ఏటూరునాగారంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏటూరునాగారం మండలకేంద్రానికి చెందిన గంగయ్య(50), లక్ష్మీనారాయణ, లోకేష్ అనే ముగ్గురు వ్యక్తులు శుక్రవారం రాత్రి అడవి జంతువులను వేటాడేందుకు మండలంలోని చిన్న బోయినపల్లి సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. అటవీ జంతువులను హతమార్చేందుకు వాటి అలికిడి ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ తీగలను అమర్చారు. ఆ తీగల ద్వారా కరెంట్ సరఫరా అయ్యేలా పక్కనే ఉన్న 33కేవీ తీగలకు వీరు సిద్ధం చేసుకున్న తీగలను తగిలించేందుకు గంగయ్య పక్కనే ఉన్న కర్రను తీసుకోగా.. అప్పటికే తేలిక పాటి వర్షంతో తడిసి ఉన్న ఆ కర్ర ద్వారా విద్యుదాఘాతం జరిగి గంగయ్య కుప్పకూలాడు. ఈ విషయం పక్కనే ఉన్న ఇద్దరు వ్యక్తులు గమనించి గంగయ్య చనిపోయాడనుకొని అక్కడి నుంచి పరారయ్యారు.

రాత్రంతా గాయాలతో నరకయాతన..

కాసేపటికి స్పృహలోకి వచ్చిన గంగయ్య.. ఒళ్లంతా కాలినగాయాలతో రాత్రంతా నరకయాతన అనుభవించాడు. తనతో వచ్చిన ఇద్దరు పరారవగా.. ఆదుకునేవారు లేక.. కాపాడంటూ ఆర్తనాదాలు చేశాడు. అయితే లోకేష్, లక్ష్మీనారాయణ శనివారం ఉదయం ఈ విషయాన్ని పోలీసులకు తెలపగా.. సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజోద్దిన్ తమ సిబ్బందితో అడవి బాటలో 2కిలోమీటర్లు నడిచి వెళ్లి గంగయ్యను బయటకు మోసుకొచ్చారు. 108లో స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స అందిస్తుండగా.. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. కానీ, గంగయ్య అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగాఇ, గంగయ్యకు భార్య మౌనిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

'కార్యదర్శి చేతివాటం'పై కలెక్టర్ ఆరా..

విచారణ చేపట్టిన ఎంపీడీవో రవీంద్రప్రసాద్

కొత్తగూడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటిపన్ను రశీదు ఇవ్వటంలో 'పంచాయతీ కార్యదర్శి చేతివాటం'పై కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆరా తీసినట్టు తెలిసింది. డీపీవో హరిప్రసాద్ నుంచి వివరాలు తీసుకున్నట్టు సమాచారం. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు పంచాయతీ కార్యదర్శి రమేష్ గ్రామ పంచాయతీకి చెందిన వ్యక్తికి ఇంటి పన్ను రశీదులు ఇవ్వటం కోసం డబ్బులు డిమాండ్ చేయడంతో అడిగిన మొత్తంలో సగం ఇచ్చి ఇంటిపన్ను రశీదులు తీసుకున్నాడు. ఈ వ్యవహారంకు సంబంధించిన వీడియో 'ఆంధ్రజ్యోతి' దగ్గరకు చేరడంతో 'పంచాయతీ కార్యదర్శి చేతివాటం' పేరుతో ఈనెల 21న(శుక్రవారం) ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ విచారణ చేయించాలని డీపీవోను ఆదేశించారు. డీపీవో హరిప్రసాద్ విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఎంపీడీవో రవీంద్రప్రసాద్‌ను ఆదేశించారు. కాగా, విచారణ చేసి సోమవారం నివేదిక ఇవ్వనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

నకిలీ పురుగుల మందుల విక్రయ ముఠా అరెస్టు

- ఐదుగురి అరెస్టు, ఒకరు పరార్, మరొకరు జైలులో
- రూ.78.63లక్షల మందులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గడువు తీరిన వాటితో పాటు నకిలీ పురుగు మందులను విక్రయిస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. నిందితుల నుంచి రూ.78లక్షల 63వేల విలువ గల నకిలీ పురుగు మందులు, విత్తనాలు, మందులు తయారీ చేసే మిషన్, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ ముఠా సభ్యుల వివరాలను వెల్లడించారు. వరంగల్‌లోని మట్టెవాడ బొడ్రాయి ప్రాంతంలో ఇరుకుళ్ల వేదప్రకాశ్ ఇంట్లో నకిలీ పురుగు మందులు భారీగా నిల్వ చేశారనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులతో పాటు వ్యవసాయాధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. అక్కడ పెద్ద మొత్తంలో నకిలీ పురుగు మందులను స్వాధీనం చేసుకొని వేదప్రకాశ్‌ను పోలీసులు విచారించారు.

విచారణలో వేదప్రకాశ్ సులువుగా డబ్బు సంపాదించేందుకు స్థానిక వ్యాపారుల వద్ద గడువు తీరిన పురుగు మందులను కొనేవాడు. వరంగల్ లక్ష్మీపురానికిచెందిన పురుగుల మందుల కంపెనీ ప్రతినిధి సిద్దిక్ వద్ద గడువు తీరిన పురుగు మందులతో పాటు ప్రకాశం జిల్లా మడుగుకు చెందిన ఆళ్లచెరువు శేఖర్, విష్ణువర్ధన్‌ల నుంచి ప్రముఖ కంపెనీలైన దునూక, టాటా, రైల్స్, బెయర్, అడ్మాతో పాటు మరికొన్ని కంపెనీల పేర్లతో తయారుచేసిన నకిలీ మందులు కొనుగోలు చేసేవాడు. ఇలా కొనుగోలు చేసిన నకిలీ, గడువు తీరిన మందులను కరీంనగర్‌కు చెందిన యల్లం సదాశివుడు, ములుగు జిల్లా గోవిందరావుపేట మండలానికి చెందిన ఎం.డి.రఫీక్, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన నూక రాజేష్, హైదరాబాద్‌కు చెందిన ముద్దగుల ఆదిత్య, వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన పొదిళ్ల సాంబయ్యలకు విక్రయించేవాడు.వాళ్లు మార్కెట్‌లో రైతులను నమ్మించి అంటగట్టేవారు.

కాగా, ఈ దందాలో పాల్గొన్న ఇరుకుల్ల వేదప్రకాశ్, సిద్దికీ, నూక రాజేష్, రఫీక్, ఆళ్లచెరువు శేఖర్‌లను అరెస్టు చేయగా విష్ణువర్ధన్ పరారీలో ఉన్నాడని సీపీ పేర్కొన్నారు. అలాగే ముఠాలో ప్రధాన నిందితుడైన వేదప్రకాశ్‌పై కరీంనగర్‌లో 3 కేసులు ఉన్నాయన్నారు. నూక రాజుపై వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 8 కేసులు, సదాశివుడిపై గీసుగొండలో కేసు నమోదైందన్నారు. అదే విధంగా ఆదిత్యపై కేసు నమోదు కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో జైలులో ఉన్నాడని సీపీ తెలిపారు. నిందితులు ఇలాంటి దందాలు చేసేందుకు వీలు లేకుండా పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పరిమితమయ్యేలా చేస్తామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఏసీపీలు మధుసూదన్, నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్ గోపి, రాజు, ఎస్సైలు వంశీకృష్ణ, నవీన్, ఆర్ఎస్సై భానుప్రకాశ్, ఏఏవో సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు సురేశ్, సురేందర్, సాంబరాజు, శ్రీనువాస్, సతీష్‌కుమార్, నాగరాజులను సీపీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులను అందజేశారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కులం పేరుతో దూషించిన ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... వీరారం తండాకు చెందిన భూక్య శ్రీను, మహబూబాబాద్‌కు చెందిన డాక్టర్ ప్రమోద్‌రెడ్డికి గత కొద్ది నెలలుగా భూ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే శనివారం ఇరువురి మధ్య వాగ్వావాదం జరిగింది. దీంతో భూక్య శ్రీనును కులం పేరుతో ప్రమోద్‌రెడ్డి, వీరన్న, పూర్ణచందర్‌తో పాటు మరికొంత మంది దూషించినట్లు చెప్పారు. బాధితుడు భూక్య శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరికి ప్రాణం పోసిన వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉరుములతో కూడిన వర్షం కురిసి వరి రైతులకు ఊరట కలిగించింది. మండు వేసవిలో ఎండలు ముదిరి భూగర్భ జలాలు అందక పలుచోట్ల పొలాలు ఎండుతున్న తరుణంలో వర్షం కురియడంతో ఆ రైతులు ఆనందంతో ఉండగా వరి పొలాలకు ప్రాణం పోసినట్లయింది. అంతేకాకుండా ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నండగా వాతావరణం చల్లబడింది. తొర్రూరు, నెల్లికుదురు, కేసముద్రం, కొత్తగూడ, మహబూబాబాద్ మండలాల్లో వర్షం కురియగా, పలు మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

37.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లాలో 37.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడలో 4.2, మహబూబాబాద్‌లో 3.2, కేసముద్రంలో 4.2, నెల్లికదురులో 6.6, నర్సింహులపేటలో 2.8, చిన్నగూడూరులో 1.0, మరిపెడలో 1.0, దంతాలపల్లిలో 2.0, తొర్రూరులో 9.6, పెద్దవంగరలో 2.8 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 2.4 మిల్లిమీటర్ల వర్షపాతం కురిసింది.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెంది ఇతర దేశాల్లో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకంకు మే 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నరసింహస్వామి శనివారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం యూఎస్ఏ, యుకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, సౌత్ కొరియా, న్యూజిలాండ్ దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో పోస్టుగ్రాడ్యుయేట్ తదితర ప్రొఫెషనల్ కోర్సుల్లో చదవాలనుకుంటున్న ఎస్సీ విద్యార్థుల నుంచి తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎస్సీ వారై ఉండాలని, సంవత్సర ఆదాయం రూ.5లక్షలకు మించి ఉండరాదని, పీజీ చదవటానికి గ్రాడ్యుయేషన్‌లో ఫస్ట్‌క్లాస్ మార్కులు వచ్చి ఉండాలని, టోఫెల్ లేదా ఐఈఎల్‌టీఎస్ లేదా జీఆర్ఈ లేదా జీఎంఏటీ నందు అర్హత కలిగి ఉండాలని, పాస్‌పోర్టు నందు వీసా అర్హత కలిగిఉండాలని, విదేశీ విశ్వవిద్యాలయం నందు ప్రవేశం పొంది ఉండాలని, ఒక కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు వెబ్‌సైట్ www. telangana.epass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యువ వికాసం కోసం..

- రాష్ట్ర ప్రభుత్వ కొత్త పథకంపై యువత ఆసక్తి
- దరఖాస్తు విధానంపై అవగాహన లేక అవస్థలు
- కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం పరుగులు
- ఎనిమిదేళ్లుగా కార్పొరేషన్ రుణాల కోసం బీసీ యువత ఎదురుచూపు

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పారంభించిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు యువత ఆసక్తి చూపుతోంది. అయితే ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడంలో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 17న ప్రారంభమైన అప్లికేషన్ల ప్రక్రియ నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు కొనసాగనుంది. కానీ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు ఎదురవుతుండటంతో దరఖాస్తుదారులకు తిప్పలు తప్పడంలేదు. ఇక దరఖాస్తు విధానంపై ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ యువతకు అవగాహన కల్పించాల్సిన అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే దరఖాస్తుకు ఆదాయ, కుల ధ్రువపత్రాలు తప్పనిసరి కావడంతో తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు లక్షమంది యువతకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనున్నట్లు అంచనా.

తహసీల్దార్ కార్యాలయాల వైపు పరుగులు

రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తుచేసుకునేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తప్పని సరి చేయడంతో యువత తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు తీస్తు న్నారు. ముఖ్యంగా మీసేవా కేంద్రాల వద్ద యువత దరఖాస్తు చేసేందుకు బారులు తీరుతున్నారు. ఇదే అదనుగా కొందరు మీసేవా కేంద్రాల నిర్వాహ కులు సర్టిఫికెట్లు తొందరగా వచ్చేలా చేస్తామంటూ రూ.2వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.



అవగాహనేదీ ?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రాజీవ్‌యువ వికాస్ పథకంపై ప్రజలకు అవగా హన కల్పించడంలో అధికారులు మీనమేశాలు లెక్కిస్తున్నారు. ప్రకటనలతో సరిపెడుతున్న అధికారులు క్షేత్రస్థాయిలో పథకం ప్రాముఖ్యాన్ని వివరించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ యువతకు స్వయం ఉపాధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని తీసుకొస్తే ఆయా సంక్షేమశాఖల అధికారులు ఇప్పటివరకు పథకం తీరుతెన్నులపై ప్రజలకు అవగాహన కల్పించింది లేదు. కుల సంఘాల ముఖ్యుల జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో కుల సంఘాలతో మమేకం అవుతున్న అధికారులు అవే కులాల్లోని యువతకు ప్రభుత్వం ప్రోత్సహకాలు ఇస్తుంటే మాత్రం ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు శూన్యం. ఇప్పటికైన అధికారులు కుల సంఘాలతో సమావేశాలు నిర్వహించి పథకం అమలుపై అవగాహన కల్పించి అర్హులైన వారికి పథకం ద్వారా లబ్ధిచేకురేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎనిమిదేళ్లకు అవకాశం

బీసీ కార్పొరేషన్ రుణాలను గత ప్రభుత్వం నీరుగార్చడంతో కార్పొరేషన్ రుణాల ద్వారా స్వయం ఉపాధి పొందుదాం అనుకున్న బీసీ యువత ఆశాలు అడియాశాలయ్యాయి. 2023 ఎన్నికల ముంగిట బీసీల్లో కొన్ని కులాలకు రూ.లక్షపేరిట సాయం చేసే ప్రభుత్వం చేసిన అప్పటి ప్రభుత్వం.. ఆపథకం పూర్తి స్థాయిలో అమలుకాకపోవడంతో చాలా మందికి నిరాశే ఎదురైంది. దాదాపు ఎనిమిదేళ్లుగా మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పేరిట స్వయంఉపాధి పథాకానికి అంకురార్పణ చేయడంతో బీసీ యువత పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకుంటున్నారు.

రేషన్ కార్డుల్లో పేరు లేకపోతే ఎలా ?

రాజీవ్ యువ వికాసం పథకం ప్రభుత్వం రేషన్‌కార్డు తప్పనిసరి చేయడంతో చాలా మంది యువత ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొంత మందికి ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరుచేయగా మరి కొందరివి వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో రేషన్ కార్డుల్లో పేరులేని వారి పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. నూతన రేషన్ కార్డులు మంజూరుచేసిన తరువాతే ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తులు ఆహ్వానించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

పథకానికి అర్హులు వీరే..

రాజీవ్ యువవికాసం పథకానికి రూ. 6వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం అర్హుల ఎంపికకు నిర్ధిష్ట విధానాలను ప్రకటించింది. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ యువకులను అర్హులుగా పేర్కొంటూ.. మూడు రంగాల్లో యువతను ప్రోత్సహించనుంది. వ్యవసాయం, పశుపోషణ, వ్యాపార రంగంలో స్వయం ఉపాధి పొందే యువతకు సాయం అందించనుంది. ఈపథకానికి ఎంపికైన యువకులు ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.4 లక్షల వరకు రుణాన్ని అందించనుంది. ఆ రుణాన్ని బట్టి 60 శాతం నుంచి 80 శాతం వరకు సబ్సిడీ భరిస్తోంది. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్‌కార్డ్, శాశ్వత నివాసం (డొమిసిల్), కులం, ఆదాయం సర్టిఫికెట్లు, బ్యాంక్ ఖాతా, రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. ఇక ఆన్‌లైన్‌లో https://tgobmmsnew.cgg.gov.in వెబ్‌సైట్‌లో అప్లై చేసుకోవాలి. రేషన్‌కార్డులో ఒకరిని మాత్రమే పథకంలో అర్హులుగా గుర్తించనున్నారు.

పండగలకు.. ధరల ఘాటు!

- మండుతున్న మామిడి, నూనె, కారం
- ఇదే బాటలో డ్రైఫ్రూట్స్, సేమియా, ముడి సరుకులు
- విపరీతంగా పెరిగిన పండ్ల ధరలు
- 30న ఉగాది, 31న రంజాన్ పండుగలు

మహబూబాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అసలే మార్చి.. మండుతున్న ఎండలకు తోడు.. నిత్యావసర సరుకుల ధరలూ సుర్రుమంటున్నాయి. నిత్యావసరాల్లో అతికీలకమైన బియ్యం, అల్లం, వెల్లుల్లి, కూరగాయల ధరలు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఈ నెల 30న తెలుగు సంవత్సరాది ఉగాది, 31న ముస్లింల పవిత్ర రంజాన్ పండుగ జరుపుకోనుండగా సలసలా కాగుతున్న ధరలు దడపుట్టిస్తున్నాయి. నిత్యావసరాల్లో అతికీలకమైన బియ్యం, అల్లం, వెల్లుల్లి, కూరగాయల ధరలు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఈ నెల 30న తెలుగు సంవత్సరాది ఉగాది, 31న ముస్లింల పవిత్ర రంజాన్ పండుగ జరుపుకోనుండగా సాధారణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తెలిసిన వారు లేదంటే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి.. చే బదులుగానో.. వడ్డీకో డబ్బులు సమకూర్చుకుంటున్న పరిస్థితి ఉంది. ముఖ్యంగా నూనెల ధర సలసలకాగుతున్నాయి. పామాయిల్ లీటర్ ధర రూ.130 కాగా, వివిధ బ్రాండ్ల లీటర్ నూనె ప్యాకెట్లు రూ.150కి తగ్గకుండా విక్రయిస్తున్నారు. మిల్లు నుంచి పల్లీనూనె ధర కిలోకు రూ.240 వరకు లభిస్తోంది. సన్‌ఫ్లవర్ మిల్లునూనె ధర రూ.350కు పైగానే విక్రయిస్తున్నారు. ఈ సారి అల్లం వెల్లుల్లి ధరలు కొంత మెరుగ్గానే కన్పిస్తున్నాయి. మార్కెట్‌లో కిలో అల్లం రూ.70 కాగా, ఎల్లిపాయలు మాత్రం రూ.120కి విక్రయిస్తున్నారు. ధనియాల ధర కిలో రూ.150 పలుకుతోంది. చింతపండు కిలో రూ.130, మెంతులు, అవాలు 100 గ్రాములకు రూ.20 చొప్పున లభిస్తున్నాయి. తెలుగు ప్రజలు ఉగాది వెళ్లగానే మామిడి పచ్చళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈ ఏడాది ఆలస్యంగా మామిడిపూత రావడం, పచ్చడి కాయలకు ఇంకా పలు ప్రాంతాల్లో పిక్క ముదరకపోవడం తదితర కారణాలతో అడపదడపా వస్తున్న మామిడి ధర మండిపోతోంది. ఎర్రమిర్చి కారం ధర రూ.150 నుంచి రూ.200 వరకు లభిస్తోంది.

రంజాన్ మాసం చివరాంకంలో..

దాదాపు నెలరోజుల పాటు ఉపవాసాల దీక్ష నిర్వహించే ముస్లింల రంజాన్ మాసం పూర్తి కావొస్తోంది. ఆకాశన్నింటిన ధరలతో నిత్యం విరివిగా వినియోగించే పండ్లు, ఫలహారాలు, డ్రైఫ్రూట్స్, సేమియాల ధరలతో పేద ప్రజలు వాటికి కొంత దూరమవుతున్నారు. ఇవి సామాన్య కుటుంబాలకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. రంజాన్ అనగానే వివిధ రకాల పండ్లతో పాటు సేమియా పాయసంగా పిలుచుకునే షీర్‌ఖుర్మా అంటే తెలియని కుటుంబాలు ఉండవు. కటిక పేద ఇళ్లలో సైతం అందుబాటులోని తియ్యటి వంటకంగా సేమియా పాయసంపై ఆశలు పెంచుకుంటారు. కొన్నేళ్లుగా రేషన్ షాపుల్లో ఇచ్చే పంచదార ఎత్తేశారు. పూర్వంలో రంజాన్‌కు ముస్లింల కోసం ప్రత్యేకంగా చెక్కర కోటా ఇచ్చేవారు. ఇది నాటి మాటగానే మిగిలిపోయింది. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో ధర ఎంతఉన్నా.. కొనుక్కోక తప్పడం లేదు. ప్రస్తుతం కిలో పంచదార రూ.40కి పైనే పలుకుతోంది.

మండుటెండల్లో పండ్ల ధరల మంట..

ఉపవాసాల మాసం రంజాన్‌లో ఎక్కువగా తీసుకునే ఖర్జూరా పండ్లతో పాటు వివిధ రకాల పండ్ల ధరలు కొండెక్కాయి. మండుటెండల్లో వేడి నుంచి ఉపశమనం కోసం ప్రతీ ఒక్కరు తీసుకునే వివిధ రకాల జ్యూస్‌లను సాధారణ ప్రజలు కొనే పరిస్థితి లేదు. ప్రధానంగా మార్కెట్‌లో విరివిగా లభించే నెంబర్ వన్ రకం ఖర్జూర ధర కిలో గతేడాది రూ.500 ఉండగా ప్రస్తుతం రూ.600కు పెరిగింది. కిమియా అరకేజీ బాక్స్ ధర రూ.350 ఉండగా రూ.450 పెరిగింది. సౌదీ ఖర్జూరం రూ.800 విక్రయిస్తున్నారు. మరికొన్ని బ్రాండెడ్ ఖర్జూరాలు రూ.600 నుంచి రూ.700 వరకు విక్రయిస్తున్నారు. రెగ్యులర్ ఖర్జూర ధర రూ.120కే కేజీ లభిస్తోంది. అరచేతిలో ఇమిడే చిన్నసైజు దానిమ్మపండు కేజీ రూ.100 లభిస్తోంది. చిన్న సైజు యాపిల్ రూ.110 నుంచి రూ.120కి నాలుగు వరకు ఇస్తున్నారు. చిన్న తెల్లద్రాక్ష కేజీ రూ.80, కాగా, సీడ్‌లెస్ నల్లద్రాక్ష రూ.200లకు కేజీ విక్రయిస్తున్నారు. అరటి పండ్ల ధరలు సైజును బట్టి డజనుకు రూ.80నుంచి 120కి విక్రయిస్తున్నారు. జామపండ్లు కేజీ రూ.50 నుంచి విక్రయిస్తున్నారు. పైనాపిల్‌ను సైజుల వారీగా కాయ రూ.70నుంచి రూ.80చొప్పున విక్రయిస్తున్నారు. పసుపు రంగు ఖర్బూజ కిలో రూ.60 నుంచి రూ.70 వరకు, వాటర్‌లెమన్ ఖర్బుజ కిలో రూ.25 నుంచి రూ.30 వరకు అమ్ముతున్నారు. బొప్పాయి కిలో రూ.30 నుంచి రూ.40 మధ్య విక్రయిస్తున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న పండుగ ముడి సరుకులు



మార్కెట్‌లో విక్రయానికి సిద్దంగా ఉన్న పండ్లు

షీర్ ఖుర్మా.. బిర్యానీ వంటకాల ధరలిలా..

రంజాన్ నెలరోజుల పాటు అతిప్రియంగా భుజించే సేమియా పాయసంగా పిలుచుకునే షీర్‌ఖుర్మాలో ముడి సరుకైన పిండితో చేసే సేమియాలు, డ్రైఫ్రూట్‌ల ధరలు పెరిగిపోయాయి. రోస్టెడ్ సేమియా కిలో రూ.150 విక్రయిస్తున్నారు. పెరిగిన రేట్లతో వైట్ సేమియా రూ.130కి విక్రయిస్తున్నారు. అహ్మదాబాద్ సేమియా రూ.160 నుంచి రూ.180కి పెరిగింది. హాల్‌హాల్ సేమియా రూ. 180 నుంచి రూ.200 వరకు, పేనీ నెయ్యి సేమియా రూ.400కు అమ్ముతున్నారు. పాలు లీటర్ ధర రూ.80, పాయసంలో వేసే చిరంజి కిలో ధర గతేడాది రూ.1800 ఉండగా ప్రస్తుతం రూ.2500విక్రయిస్తున్నారు. జీడిపప్పు నెంబర్-1 కిలో రూ.900కు, బాదంపప్పు రూ.900, ఎండు ఖర్జూర రూ.500, కిష్‌మిస్ రూ.400, తర్బూజ గింజలు రూ.800, ఎండు కొబ్బరి రూ.400, పంచదార రూ.45, నెయ్యి రూ.800 వరకు విక్రయిస్తున్నారు. దీంతో సేమియా పాయసం రుచి చూడకముందే ధరలతో పేదోళ్లకు చేదెక్కుతోంది. బిర్యానీ వంటకానికి వాడే ముడిసరుకుల్లో 100 గ్రాములకు ధరలు ఇలా ఉన్నాయి. జాజికాయ రూ.100, జాపత్రి ధర రూ. 300, అనాసపువ్వు రూ.100, మరాటి మొగ్గ రూ.60కి, ఇలాచి రూ.400, లవంగాలు రూ.100, దాల్చిన చెక్క రూ.60, సాజీరా రూ.110, బాస్మతి రైస్ కేజీ రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు.

ధరాభారంతో విక్రయాలు అంతంతే..



మహ్మద్ అబ్దుల్ రహీం, రంజాన్ సామగ్రి దుకాణం వ్యాపారి, మహబూబాబాద్

పెరిగిపోతున్న ధరలతో విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. రంజాన్ ప్రత్యేక దుకాణాలకు ముడిసరుకులు, డ్రైఫ్రూట్స్‌ను హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకుని ఇక్కడ విక్రయాలు చేపడుతున్నాం. గతేడాది పండుగతో పోలిస్తే పండుగ సమీపిస్తున్నా ఇంకా మార్కెట్ జోరందుకోలేదు. నెల చివర్లో పండుగ రావడంతో బాడుగ (ఉద్దెర) బేరాలు కొంత వర కు నడుస్తున్నాయి. లాభాల మాట ఆలా ఉంచితే తెచ్చిన సరుకులు అమ్ముడుపోతాయా.. లేదా అన్న సందేహం వస్తుంది.

సంప్రదాయ పండితుడు లక్ష్మణమూర్తి

- పెరుంబుదురు అస్తమయంపై సాహితీలోకం దిగ్భ్రాంతి
- నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు



లక్ష్మణమూర్తి (ఫైల్)

హనుమకొండ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ సంప్రదాయ పండితుడు, బహుభాషా గ్రంథకర్త కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆంగ్లశాఖలో ఆచార్యుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన శ్రీ పెరుంబుదురు లక్ష్మణమూర్తి (85) ఇక లేరన్న వార్త ఓరుగల్లు సాహితీలోకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయనకు భార్య డాక్టర్ జయశ్రీ ఏవీవీ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని చిన్న కుమార్తె వద్ద ఉంటున్న ఆయన శనివారం ఉదయం తుదిశ్వాస విడిశారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో 1940 జూలై 20న జన్మించిన.. ఉద్యోగపర్వమంతా సుమారు మూడున్నర దశాబ్దాలపాటు కాకతీయ విశ్వవిద్యాలయంలో కొనసాగడంతో హనుమకొండ విద్యారణ్యపురిలో స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. వైష్ణవ సంప్రదాయం, వైదిక ధర్మాసక్తి, సాంస్కృతిక భాషకు ఆవాసమైన పండిత కుటుంబంలో జన్మించడం వల్ల ఆయన చిన్నప్పటి నుంచే తెలుగుభాషతోపాటు ఆంగ్లం, సంస్కృత భాషల్లోనూ ఆపార పాండిత్యాన్ని కలిగి ఉండేవారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు ఈయన ఆత్మీయ శిష్యుడు. కేయూలో ఆంగ్ల జర్నల్‌కు సంపాదకుడిగా పనిచేశారు.

శ్రీకృష్ణుడి మీద భక్తిప్రపత్తులతో గోపిక వల్లభ శతకంతోపాటు ఇతర భాషాల్లోనూ అనేక గ్రంథాలను ప్రకటించారు. తెలుగు తెలియని విదేశీయులు ఎవరొచ్చినా అద్భుత అనువాదకుడిగా లక్ష్మణమూర్తి వ్యవహరించేవారు. స్వామి వివేకానంద అంటే ఆయనకు అపారమైన భక్తిభావం. తన శిష్యులందరికీ వివేకానందుడి బోధనలు అనుసరించేలా మార్గదర్శనం చేసేవారు. రామాయణ, భాగవత, భగవద్గీత ఉపనిశత్తులపై సాధికారికంగా అనేక సభల్లోనూ రెండు తెలుగు రాష్ట్రాల్లో పాల్గొన్నారు. చిన్నజీయర్‌స్వామి శిష్యుల్లో ఒకరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తమ ఆచార్యుడిగా సత్కారం అందుకున్నారు. నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యస్వామితో స్వర్ణ కంకణ సత్కారాన్ని అందుకోవడం లక్ష్మణమూర్తి ప్రతిభా పాండిత్యానికి నిదర్శనం. అనేక మందికి ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడపాలంటూ ఇతోక్తులు చేసిన అందరితో సహృదయంగా సవియనంగా భాసిల్లిన లక్ష్మణమూర్తి ఇక లేరన్న విషయాన్ని ఓరుగల్లు సాహితివేత్తలు, ఆయన శిష్యగణం జీర్ణించుకోలేకపోతున్నారు. కాగా, ఆయన అంత్యక్రియలు ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోనే నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

తీరనిలోటు

ఆచార్య లక్ష్మణమూర్తి మృతి చెందడం శ్రీ వైష్ణవ సంప్రదాయినికి తీరని లోటని, ఆయన మృతితో ఓరుగల్లు ఒక గొప్ప పండితుడిని కోల్పోయిందని కాళోజీ ఫౌండేషన్ చైర్మన్ నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్.విద్యార్థి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అదే విధంగా ఆయనతో సాన్నిహితంగా మెదిగే ఆచార్య కె.దామోదర్‌రావు, ఆర్‌పి.పరాంకుశం, రాజేశ్వరశాస్త్రి, మలహలరావు, గోనారెడ్డి, వాసిరెడ్డి కృష్ణారావు, కొండా సత్యనారాయణ తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్, పొట్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ ఎన్‌వీఎన్.చారి, గిరిజా మనోహర్, కుందావజ్జుల కృష్ణమూర్తి, సముద్రాల శఠగోపాచార్య తదితర ప్రముఖులు లక్ష్మణమూర్తి మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

అటు సినీ రంగం.. ఇటు సేవా గుణం



ఓ ఈవెంట్‌లో హీరో మంచు మనోజ్, నటుడు సంపూర్ణేష్ బాబుతో సంజోష్



బేవర్స్ సినిమాలోని ఓ సన్నివేశంలో నటుడు రాజేంద్ర ప్రసాద్‌తో సంజోష్



సంజోష్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న సంజోష్ (ఫైల్)

- ప్రత్యేకతను చాటుకుంటున్న యువ హీరో, బేవర్స్ ఫేం సంజోష్
- సినిమాల్లో నటిస్తూనే సామాజిక సేవలో..
- 'మన జిల్లా హీరో.. మన కోసం' పేరుతో సాయం
- సంజోష్ ఫౌండేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు

ఏటూరునాగారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు పేదరికాన్ని జయించి.. వెండితెరపై రాణిస్తున్నాడు. యువహీరోగా తన ప్రయాణాన్ని కొనసాగించడమే కాకుండా సమాజ సేవలతోనూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. అలా అతి తక్కువ సమయంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్నాడు. సంజోష్. 'బేవర్స్' సినిమాతో విజయాన్ని అందుకుని తెలుగుచిత్ర సీమలో రాణించిన సంజోష్ ఏప్రిల్‌లో సోదరా అనే మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామానికి చెందిన హరి సంజోష్ ములుగులోని ప్రేమనగర్ వివేకానంద పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన తర్వాత హైదరాబాద్‌లో ఇంటర్, సీఎంఎస్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. చిన్నతనం నుంచే సినీ రంగమంటే ఆసక్తి ఉన్న సంజోష్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కి వీరాభిమాని. సినిమాలపై ఆసక్తితో 2016లో పరిశ్రమలోకి వెళ్లి తొలుత పలు సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు. అక్కడితో ఆగకుండా హీరో అవ్వాలన్న లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించి ప్రముఖ సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్ ముఖ్య పాత్రలో నటించిన బేవర్స్ సినిమాలో హీరోగా తొలి అవకాశం దక్కించుకున్నాడు. 2018లో విడుదలైన ఆ సినిమాలో సంజోష్ నటన ఆకట్టుకుంది. ప్రస్తుతం సోదరా అనే సినిమాలో సంజోష్ హీరోగా నటిస్తున్నారు.

సంజోష్ ఫౌండేషన్ పేరుతో పేదలకు అండగా..

సినీ రంగంలో రాణిస్తూనే.. 'మన జిల్లా హీరో.. మన కోసం అనే' నినాదంతో సంజోష్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసుకొని ఆ ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నాడు సంజోష్. గొత్తికోయగూడేలు, ఆదివాసీ గ్రామాల్లో పర్యటిస్తూ వారికి వైద్యం, విద్య, నిత్యవసర వస్తువులు అందజేస్తున్నారు. అదేవిధంగా ఆపన్నులను ఆర్థికంగా ఆదుకుంటూ ఆదర అభిమానాలు పొందుతున్నాడు. తాజాగా ఏటూరునాగారం మండలానికి వచ్చిన సమయంలో ఆయన మండలంలోని రామన్నగూడెం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలతో పాటు మండలంలోని పలు పాఠశాలాల నిరుపేద విద్యార్థులకు చేయూతనందించారు. సుమారు 150 మంది విద్యార్థులకు ఉచితంగా టై, బెల్ట్, షుస్, నోట్ బుక్స్, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్సిల్స్ తదితర వస్తువులను అందించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలోని 96 మంది పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష కిట్స్‌ను పంపిణీ చేశారు. దీంతో పాటు రామన్నగూడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాల నుంచి ఇటీవల నేషనల్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదును ప్రోత్సాహకంగా అందించారు. పేద విద్యార్థులకు తన ఫౌండేషన్ ద్వారా ఎల్లప్పుడూ అండగా ఉంటానని, నలుగురు విద్యార్థులను తన సొంత ఖర్చులతో చదివిస్తున్నానని సంజోష్ ఆ సందర్భంగా వెల్లడించారు.



ఆదివాసీలకు భోజనం వడ్డిస్తున్న సంజోష్ (ఫైల్)

హోరెత్తించిన టెక్నో సాంస్కృతిక సంబురాలు

- ఆటపాటలతో ఇంజనీరింగ్ విద్యార్థులు జోరు
- వైభవంగా ముగిసిన రూబీజెస్టు-25 వేడుకలు

కేయూ క్యాంపస్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ విద్యార్థులు సాంస్కృతిక సంబరాలతో హోరెత్తించారు. కేయూ ఆడిటోరియంలో మూడు రోజులుగా జరుగుతున్న రూబీజెస్టు-2025 ఉత్సవాల్లో భాగంగా అఖరు రోజున శనివారం 'వైబ్రేన్స్ కార్నివాల్' నిర్వహించారు. గ్రామీణ సంబంధాలను జానపద గేయ నృత్య ప్రదర్శనలు చేశారు. ప్రాంతీయ స్థితిగతులను తెలిపే సినీ పాటలతో డ్యాన్స్‌లు చేశారు. సాంకేతిక, క్రీడలతో విద్యార్థులలో సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమాలను కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పర్యవేక్షించారు. విద్యార్థులు జీవితంలో సక్సెస్ సాధిస్తే రోజు పండుగేనని చెప్పారు. కన్వీనర్ కందుల సాయితరుణ్ మాట్లాడుతూ. టెక్నికల్ ఫెస్ట్, థీమ్‌డే, కల్చరల్ ఫెస్టులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమాల కోఆర్డినేటర్లుగా ఎల్.సాత్విక, పోలు వర్షిత, జాహ్నవి, సాహితీ, ఆకాంక్షతో పాటు అధ్యాపకులు వీణ, వాణిశ్రీ, స్వప్న, వెంకటేశ్, సురేందర్, కిరణ్‌కుమార్, యశస్విని, దీప్తి, శ్రీజ, రచన, కిషన్, శ్రీనివాస్, రామాజ్యోతి, శ్రీవిద్య, జోత్స్న, అనూష, రాజ్‌కుమార్, విష్ణువర్ధన్, దేవేందర్, సూపరింటెండెంట్ వీరునాయక్, మల్లేశం, జగన్, సంజయ్, యాదగిరి, ఫిరోజ్, సుజాత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది



• ఎవరూ చూడలేదు కదా..



• ఇటెవరూ లేరు కదా..



• ఎవరూ లేరులే లాగించేద్దాం

భూపాలపల్లి పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన మొక్కజొన్నలను రాసిగా పోసి విక్రయించుకునే వారి నుంచి శనివారం ఓ వానరం ఓ కంకిని దొంగిలించింది. ఆ పక్కనే ఉన్న ఓ గుడిసె పైకి ఎక్కి.. తాను తస్కరించిన దృశ్యాన్ని ఎవరైనా చూశారా? అన్నట్టుగా ఇదిగో ఇలా అటూ ఇటూ చూసి.. చివరకు ఆ కంకిని ఆరగించేసింది.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి

'సోలార్' వినియోగంపై అవగాహన కల్పించాలి

● అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ

మహబూబాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో శనివారం రైతులకు సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సోలార్ విద్యుత్ కోసం 126 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులు సోలార్ వినియోగంపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సోలార్ పట్ల త్వరలోనే వినియోగదారులకు హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా విద్యుత్‌శాఖ అధికారి నరేష్, పెద్దిరాజు, విజయ్, బ్యాంకు మేనేజర్ సత్యనారాయణమూర్తి, రాజ్యలక్ష్మి, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి' లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ఉపాధి హామీ పనుల లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధిహామీ పనులు, పన్నుల వసూళ్లు, ఎల్‌ఆర్ఎస్, తదితర అంశాలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సిబ్బందితో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచి, వందరోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం ఎండ కాలం దృష్ట్యా ఉదయం 11 గంటల్లోపు పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పని చేసేచోట కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 31 ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం.. గ్రామపంచాయతీ, మునిసిపల్ పరిధిలో ఇంటిపన్నులు, నల్లా పన్నులు వందశాతం వసూలు చేయాలన్నారు. గ్రామాలు, మునిసిపల్‌పరిధిలో అంతర్గత రోడ్ల పెండింగ్ పనులు, తదితర అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ పథకం కింద అర్హులైన ప్రతీ ఒక్కరికి 25 శాతం సబ్సిడీ కల్పించి ఫీజు చెల్లించిన వారికి ప్రొసిడింగ్ కాపీలు మంజూరు చేయాలని ఆయన అన్నారు.

డీఆర్‌డీవో పీడీ మధుసూదన్‌రాజు, డీపీవో హరిప్రసాద్, పంచాయతీరాజ్ ఈఈ విద్యాసాగర్, డీఎల్‌పీవోలు పుల్లారావు, దుర్గా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు లెనిన్ వత్సల్ టొప్పొ



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సునంద

టోల్ ఫ్రీనెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలి

● షీ టీం ఎస్సై సునంద

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : అసభ్యకరంగా ప్రవర్తించే వారిపట్ల అప్రమత్తంగాఉండాలని షీటీం ఎస్సై సునంద అన్నారు. షీటీం సెల్‌నెంబర్, వాట్సాప్ నెంబర్ : 8712656935కు ఫిర్యాదు చేయాలన్నారు. మానుకోటలోని సాంఘిక సంక్షేమ మహిళా ఫార్మసీ కళాశాలలో శనివారం సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థినులపై జరుగుతున్న అమాయిత్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌చేసి అనుచితం, అసభ్యకరంగా ప్రవర్తించినా వెంటనే షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్నరెడ్డి, భరోసా సిబ్బంది జ్యోత్స్న, జయశ్రీ, ఉమెన్ కానిస్టేబుల్ సుప్రజ, షీ టీం సిబ్బంది అరుణ, సార్వతి, రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి డాక్టరేట్

గూడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా తన వృత్తిని కొనసాగిస్తూ ఒక్కరు మారిన చాలు అనే ఫౌండేషన్‌ను స్థాపించి తనవంతు సామాజిక సేవకార్యక్రమాలు చేస్తున్న మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఏపూరు గ్రామానికి చెందిన వాంకుడోతు గోపినాథ్‌ను హర్యానా రాష్ట్రానికి చెందిన మ్యాజిక్ అండ్ ఆర్ట్ విశ్వవిద్యాలయం వారు శనివారం దేశరాజధాని ఢిల్లీలో డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ చైర్మన్, సుప్రీంకోర్టు అడ్వకేట్ డాక్టర్ రామ్ అవతార్‌శర్మ చేతుల మీదుగా గోపినాథ్ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా గోపినాథ్ మాట్లాడుతూ తాను చేస్తున్న సేవ కార్యక్రమాలనుగుర్తించి గూడూరు ఏజెన్సీకి చెందిన తనకు ఢిల్లీస్థాయిలో తనకు అత్యున్నత గౌరవం దక్కడ ఆనందంగా ఉందన్నారు.


అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ చైర్మన్ రామ్ అవతార్‌శర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకుంటున్న గోపినాథ్

వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేసుకోవాలి

● కేవీకే సమన్వయకర్త మాలతి

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాన్ని అభివృద్ధి చేసుకుని ఆదాయం సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ఎస్.మాలతి రైతులను కోరారు. మహబూబాబాద్ మండలం మల్యాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం యువ రైతులకు పెరటి కోళ్ల పెంపకంపై నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఆర్య ప్రాజెక్టు కింద 30 మంది రైతులకు నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం కొనసాగింది. శిక్షణలో భాగంగా రైతులు కురవిలో పౌల్ట్రీ ఫాంలను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అనుబంధంగా అనేక రకాలుగా లాభాలను ఆర్జించవచ్చన్నారు. చివరిరోజు కేవీకేలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల మాట్లాడుతూ కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి, ఆధునిక వ్యవసాయాన్ని అందిపుచ్చుకుని ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవాలన్నారు. జిల్లాపశువైద్యాధికారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పెరటికోళ్ల పెంపకంలో లాభాలు ఎలా సాధించాలో రైతులకు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్య ప్రాజెక్టు ఇంచార్జ్ క్రాంతికుమార్, మహబూబాబాద్ ఏడీఏ మురళి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ రాంబాబు, డాక్టర్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను సక్సెస్ చేయాలి

● సీపీఐ మాజీ మునిసిపల్ ఫ్లోర్ లీటర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న ఓసీ క్లబ్‌స్వాధీన కోసం ఈనెల 24న జరుపతలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సీపీఐ మాజీ మునిసిపల్ ఫ్లోర్ లీటర్ బి.అజయ్‌సారథిరెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లాలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముమ్మాటికి ఓసీక్లబ్ ప్రభుత్వానిదేనన్నారు. సుమారు రెండెకరాల స్థలంలో ఓసీ క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని లేని పక్షంలో దశలవారీగా పోరాటాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ప్రజాప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసేందుకు ప్రయత్నించారని చెప్పారు. సీపీఐ పోరాటంతోనే దానిని కాపాడడం జరిగిందన్నారు. పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న,మామిండ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్, ఎండి.ఫాతీమా, అశోక్, యాకమ్మ, రాజకుమారి, మంద శంకర్, పురం భాగ్యలక్ష్మి, పద్మ, రాణి, మల్లికార్జున్, శ్రీనివాస్, శ్రీనాథ్,రవిచంద్ర బోస్, రమేష్, ప్రవీన్‌రెడ్డి, మల్లయ్య, సత్యం, వెంకన్న పాల్గొన్నారు.

భూగర్భ జలాల సంరక్షణపై దృష్టి సారించాలి

కురవి, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాల కోసం భూగర్భ జలాల సంరక్షణకై దృష్టిసారించాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నర్సింహస్వామి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా కురవిలోని రైతువేదికలో భూగర్భ జలాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి వృధాను అరికట్టాలని, ఇంకుడుగుంతల నిర్మాణం విరివిగా చేపట్టాలన్నారు. తద్వార భూగర్భ జలాల సంరక్షణకు వీలు కలుగుతుందన్నారు. భూగర్భ జలాల అధికారి వేముల సురేష్ మాట్లాడుతూ బోర్‌వెల్ కోసం కొబ్బరికాయల పద్ధతులు మానుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో వీరబాబు, సహాయ భూగర్భ అధికారులు శ్రీనివాస్, స్నేహ, చేతన్, సహాయ వ్యవసాయాధికారి మురళి పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నర్సింహస్వామి

ట్రాక్టర్ ప్రమాదంలో బాలుడు మృతి

గార్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పూమ్యాతండాలో శనివారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో బానోత్ సాయి (14) మృతి చెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. బానోత్ మంగీలాల్ కుమారుడు సాయి బంధువుల ట్రాక్టర్‌పై సమీపంలోని మిర్చి తోటలో బస్తాలు తీసుకరావడానికి వెళ్తున్నాడు. పొలం గట్టు దిగే సమయంలో ట్రాక్టర్ కింద సాయి జారీ పడటంతో తీవ్ర గాయాలు కాగా, గ్రామస్థులు హుటాహుటినా గార్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకవచ్చారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. కాగా, మృతుడు సాయి గార్ల జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. సాయితండ్రి మూడేళ్ల క్రితం చనిపోగా, మృతుడికి తల్లి, నలుగురు అక్కలు ఉన్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందలేదు. వివరాలు తెలియాల్సి ఉంది.


సాయి(ఫైల్)

పోలీస్‌పై మహిళ దురుసు ప్రవర్తన

● కేసు నమోదు

డోర్నకల్, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీధర్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. శుక్రవారం రాత్రి డోర్నకల్ మెయిన్ రోడ్డులో ఓ మహిళ ద్విచక్రవాహనంను పక్కకు ఆపి ఫోన్ మాట్లాడుతోంది. విధి నిర్వహణలో ఉన్న బ్లూకోర్ట్ కానిస్టేబుల్ నరేష్ అదే సమయంలో అటుగా రావడంతో ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా పక్కకు ఆపిన సదరు మహిళ ద్విచక్రవాహనాన్ని ఫొటో తీశాడు. ఎందుకు తన వెహికిల్‌ను ఫొటో తీశావ్ అంటూ.. అతడితో వాగ్వావాదంకు దిగి కానిస్టేబుల్ సెల్‌ఫోన్‌ను లాక్కుంది. ఈ విషయాన్ని కానిస్టేబుల్ నరేష్ ఎస్సైకి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

తొర్రూరు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన శనివారం మాటేడులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. హనుమకొండ జిల్లా నడికుడకు చెందిన పున్నం చందర్ మరిపెడ మండలంలో ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి తన ద్విచక్రవాహనంపై తొర్రూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో కుడి కాలు విరిగింది. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి..

దంతాలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : దాట్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు చిర్ర శ్రీను శుక్రవారం తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం. శ్రీను రోజువారీగా తాటి చెట్టుపై కల్లు తీసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో మోకు జారడంతో శ్రీను కిందపడిపోవడంతో గాయపడ్డాడు. బంధువులు వెంటనే అయనను తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

బీఆర్‌ఎస్వీ నేతల ముందస్తు అరెస్ట్

మరిపెడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ముట్టడికి బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు ఇవ్వడంతో ఆ సంఘ బాధ్యులను మరిపెడ పోలీసులు శనివారం ముందస్తు అరెస్ట్ చేశారు. మధ్యాహ్నం వరకు ఉంచి, ఆ తర్వాత వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో భూక్యా ప్రవీణ్ నాయక్, భాన్యానాయక్, యూఎస్‌ఎఫ్ఐ నేత పెద్దబోయిన వీరబాబు తదితరులు ఉన్నారు.

ఇంటి పన్నులను తగ్గించాలి

మరిపెడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మునిసిపాలిటీలోని ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్నఇల్లు, వ్యాపార సముదాయాలకు అశాస్త్రీయంగా ఇంటి పన్నులు పెంచి మునిసిపల్ సిబ్బంది నిత్యం వేధిస్తుండడాన్ని నిరసిస్తూ శనివారం పలువురు బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. మరిపెడ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి స్థానిక తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రాలు అందచేశారు. బాధితులు స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా మునిసిపల్ రూల్స్‌ను అతిక్రమించి మరిపెడలో ఇష్టరాజ్యంగా ఇంటి, దుకాణ సముదాయాల పన్నులు విధించారన్నారు. ఒకే వైశాల్యం కలిగిన ఇళ్లకు, వ్యాపార కేంద్రాలకు వేర్వేరుగా పన్నులు ఉన్నాయని ఉదహరించారు. పన్నుల విధింపుపై మునిసిపల్ కౌన్సిల్ 50 శాతానికి తగ్గించాలని తీర్మానం చేసిన మున్సిపల్ అధికారులకు పట్టింపులేదన్నారు. తగ్గించే వరకు పన్నులు చెల్లించమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పుల నాగేశ్వర్‌రావు, బోనగిరి సురేష్, కర్లపాటి మధు, వంగేటి భద్రయ్య, పాముల సురేష్, కాంతారావు, నాగేశ్వర్‌రావు, వీరన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మరిపెడ పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న బాధితులు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీఎల్ఎన్ రెడ్డి

'జమిలి ఎన్నికలు అభివృద్ధికి సోపానం'

తొర్రూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : భారత దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే జమిలి ఎన్నికల నిర్వహణతోనే సాధ్యం అవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఎల్ఎన్ రెడ్డి అన్నారు. శనివారం తొర్రూరులోని కిరాణ మర్చంట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ పాలనలో దేశం అస్తిత్వం పాలుకావడానికి ప్రధాన కారణం పార్లమెంట్ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో అస్థిరత తీసుకురాకపోవడమే అని, ప్రతీ రెండేళ్లకోసారి వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల దేశ అభివృద్ధి కుంటుపడుతున్నారు. ప్రజాస్వామ్యం పటిష్టంగా క్షేత్రస్థాయి నుంచి బలపడాలంటే జమిలి ఎన్నికలే శరణ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు దశమంత్ రెడ్డి, లేగ రాంమోహన్‌రెడ్డి, పూసల శ్రీమాన్, చెన్నోజు విజయ్‌కుమార్, కోటేశ్వర్, ఆర్.కుమార్, రాజేష్, రాంబాబు, జంజిరాల నాగరాజు, చాంబర్ అధ్యక్షుడు మచ్చ సురేష్, బీజేపీ జిల్లా మండల స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

చిన్నగూడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచి, లింగనిర్ధారణ, అబార్షన్‌లు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎంసీహెచ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ సారంగం అన్నారు. శనివారం ఉగ్గంపల్లి పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ప్రసవాలను అడిగి తెలుసుకొని స్టాఫ్‌నర్సు మాధవిని అభినందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్, హెచ్‌వీలు రాజు, రాధ, సీహెచ్‌వో వలిఉద్దీన్ పాల్గొన్నారు.

నీటి సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

పెద్దవంగర, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సర్వజీవ కోటికి ప్రాణాధారమైన నీటిని సంరక్షించుకోనే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని బాల వికాస ప్రతినిధి శైలజ అన్నారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మండలంలోని చిట్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు బాల వికాస ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నీటీ నిలువపై ప్రతజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు నీటిని వృథా చేయకుండా కాపాడాలన్నారు. వర్షపు నీరు భుమిలో ఇంకడానికి ఇంకుడు గుంతలను ప్రతి ఒక్కరూ నిర్మించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల వికాస ప్రతినిధులు శోభరాణి, శైలజ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

మరిపెడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మరిపెడబంగ్లాలోని శ్రీరామాంజనేయస్వామి ఆలయ 6వ వార్షికోత్సవాల బ్రహ్మోత్సవాల పోస్టర్లను శనివారం ఆ ఆలయంలో ధర్మకర్తలు, భక్తులు ఆవిష్కరించారు. ఏప్రిల్ 2 నుంచి 7వ తేదీ వరకు రోజుకో తీరు కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అర్చకులు సుదర్శభట్టార్ తెలిపారు. గంట్లా రంగారెడ్డి పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ అసోసియేషన్ (టీజీపీఈటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు విజయసాగర్, ప్రధానకార్యదర్శి నాగరాజుగౌడ్, ఎన్నికల పరిశీలకులు డాక్టర్ శివరాజ్ తెలిపారు. మహబూబాబాద్‌లో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా వాసిరెడ్డి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా చాంప్లానాయక్, కోశాధికారిగా మహంకాళి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా తూనం పుష్పలీల, ఉపాధ్యక్షుడిగా ఈసం పద్మ, సంయుక్త కార్యదర్శిగా వెల్దండి మాధవీలను నియమించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంగిలాల్, సిద్ధార్థ, ఇమ్రాన్, కొమ్మాలు, శంకర్‌నాయక్, జహేరా, రాజకుమారి, నిర్మల, శ్రీనివాస్, కొమురయ్య, అరుణ, ఇమామ్, నాగేశ్వర్, మహేశ్వరీ, అనిల్, శ్రీను, నాగిరెడ్డి, శ్రీనివాసులు, ప్రేమ్‌కుమార్, రాంమూర్తి, కవిత, కల్యాణి, సింధువర్మ, రవీందర్ పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

నెల్లికుదురు మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గకరణ బిల్లు అమలు చేయడంతో మండలకేంద్రంలోని అంబేద్కర్‌సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం మందకృష్ణమాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తూల్ల వెంకన్న, గుండెపాక ఉప్పలయ్య, జెల్ల వెంకటేష్, జిలుక యాలాద్రి, హెచ్.అశోక్, సోమ నర్సయ్య, గాదె కృష్ణ, మల్లేష్, వేణు, వివేక్, రవి, ఎల్లయ్య, వెంకటయ్య, రంగ స్వామి, రాములు, శ్రీకాంత్, నితిన్ యాకయ్య, పాల్గొన్నారు.

జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలి

బయ్యారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరును నామకరణం చేయాలని కోరుతూ బయ్యారంలో శనివారం పాపన్న విగ్రహానికి గౌడ కులస్థులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏజన్సీ గౌడ్ పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు సత్యం, రాజన్నలు మాటాడారు. నాడు నవాబులు, ఔరంగజేబుల పాశవికపాలనకు వ్యతిరేకంగా పాపన్న ఉద్యమం చేపట్టినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు హైదరబాద్ ట్యాంకు బండపై కూడా పాపన్న విగ్రహావిష్కరణ చేయాలన్నారు. కాగా కొద్ది రోజులుగా జనగామ జిల్లాతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాపితంగా సర్దార్ సర్వాయి పాపన్న జిల్లా నామకరణ కోసం జరుగుతున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలపుతూ సంఘీబావం ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బస్వ వెంకటేశ్వర్లు, కత్తి రమేష్, మండ రవి, కొత్త వినయ్ బాబు, మోడెం సారయ్య, కంకటి నారాయణ, వల్లాల వెంకన్న, గండు నరేష్, సురేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కొనసాగుతున్న ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎస్సెస్సీ పరీక్షల్లో భాగంగా రెండోరోజు శనివారం హిందీ సబ్జెక్టు ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. 46 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షలకు రెగ్యులర్ 8,185 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8,177 (99.9 శాతం) మంది హాజరు కాగా, 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రవేటు విద్యార్థులు ఇద్దరు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. ఇద్దరు గైర్హాజరయ్యారని చెప్పారు. జిల్లాలోని పలు పరీక్ష సెంటర్లను ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు సందర్శించినట్లు డీఈవో తెలిపారు.

ఉగాది వేడుకలకు సత్యనారాయణ



మహబూబాబాద్‌ఎడ్యుకేషన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్రం మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఈనెల 28న నిర్వహించనున్న ఉగాది వేడుకలకు మహబూబాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన కవి గుర్రపు సత్యనారాయణకు శనివారం ఆహ్వానం అందింది. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించే విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య శంకరరావు ఆహ్వాన పత్రికను పంపించారు. ఈ వేడుకలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 75 మంది తెలుగు ప్రముఖ కవులు పాల్గొని పంచాంగ పఠనంతో తెలుగు సాహితీ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ వేడుకల్లో సత్యనారాయణకు ఆహ్వానం అందడం పట్ల కవులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చలో మానుకోట కరపత్రాల ఆవిష్కరణ

కేసముద్రం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 29న మానుకోటలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరుతూ కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని సబ్‌స్టేషన్‌తండాలో శనివారం కరపత్రాలను జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అజ్మీర బాలునాయక్, గుగులోత్ నరేష్, వాంకుడోత్ వెంకన్న, తేజ్యా, బాలు, మంగ్సా, వీరు, సేవేందర్, లక్మా, బిచ్చు, నరేష్, యోగి, మారుతి పాల్గొన్నారు.

డీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

కేసముద్రం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కక్కెర్ల కృష్ణమూర్తి ప్రకటించారు. మండల కమిటీ అధ్యక్షుడిగా కీర్తి నాగయ్య, ప్రధాన కారదర్శిగా దేవరాజు మల్లేషం, జిల్లా కౌన్సిలర్లుగా మూడు భీముడు, గంగుల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. నెక్కొండ మండల అధ్యక్షుడు బి.బాలాజీ పాల్గొన్నారు.


నాగయ్య, మల్లేషం అధ్యక్షుడు, కార్యదర్శి

గుడుంబా స్థావరాలపై దాడులు

నెహ్రూసెంటర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌పరిధిలో గుడుంబా స్థావరాలపై డీటీఎఫ్, ఎక్సైజ్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి తెలిపారు. కురవి మండలంలోని చర్లతండా, బయ్యారం మండలంలోని చుంచుతండా, గార్ల మండలంలోని బలాజీతండా, మహబూబాబాద్ మండలంలోని కంబాలబండా తండాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి, 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 78 లీటర్ల సారా, 50 కిలోల నల్లబెల్లం, 30 కిలోల పటిక స్వాధీనం చేసుకుని 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు చెప్పారు. గుడుంబా రవాణాకు ఉపయోగిస్తున్న మూడు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో మౌనిక, కిరీటి, మధు, శ్రీనివాస్, నర్సింగరావు, రాజు, యాదగిరి, శేఖర్, వెంకన్న, భవాని పాల్గొన్నారు.


బాధితులను చూపుతున్న డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ఇనుగుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నేషనల్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాలిటెక్నిక్, జూనియర్ కళాశాల ప్రవేశపరీక్షల పుస్తకాలను ఎంఈవో రూపారాణి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జయకృష్ణ, నరేష్, ఉపాధ్యాయులు యాదగిరి, యాకయ్య, ప్రవీణ్‌కుమార్, సమ్మిరెడ్డి, కిషన్, నారాయణ, సంపత్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

నీటి ప్రాధాన్యతపై అవగాహన

ఇనుగుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఇనుగుర్తి విజ్ఞాన్ హైస్కూల్లో శనివారం వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సహజ వనరుల్లో ఒకటైన నీటిని వృథా చేయకుండా పొదుపుగావాడుకోవాలని వారు సూచించారు. వ్యవసాయ విద్యార్థులు సుమయా ఫాతిమ, త్రిష, శ్రీజ, సంధ్య, జునేరా అల్మాస్, ఇన్‌చార్జ్ హెచ్ఎం చంద్రమోహన్, కుంచాల నిర్మల, మద్దెల నీరజ, కొణతం స్వప్న, యనమల్ల అనిత, తోట అనిత, బోళ్ల సుజాత పాల్గొన్నారు.

నీటి దినోత్సవంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

4న హనుమకొండలో జాబ్‌మేళా

నెహ్రూసెంటర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించుటకు ఏప్రిల్ 4న హన్మకొండలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్రమిశ్రా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 4న శుక్రవారం ఉదయం 10 గంటలకు గిరిజన భవన్, హన్మకొండ నందు జాబ్‌మేళా ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసి, ఎంఫార్మసీ, డి.ఫార్మసీ, ఏఎన్ఎం, జీఎన్ఎం, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ చదివి నిరుద్యోగంతో ఉన్న యువతీయువకులు ఈ సదావ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సంబంధిత విద్యార్హత జిరాక్స్ ప్రతులతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు.